# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-01-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మకర సంక్రాంతి పండుగ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.**
2. **రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.**
3. **ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు.**
4. **సాయుధ దళాల మాజీ సైనికుల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మకర సంక్రాంతి పండుగ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సూర్యుడి గమనంలో వచ్చే మార్పు కొత్త వెలుగులకు నాంది పలుకుతుందని చెప్పారు. ఈ సంక్రాంతి ప్రజల జీవితాల్లో కొత్త ఆశయాలు, ఉన్నత లక్ష్యాలను నింపాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా విభిన్న సంప్రదాయాలతో జరుపుకునే ఈ పండుగ భారతీయ సంస్కృతిలోని ఏకత్వాన్ని చాటుతుందని పేర్కొన్నారు. దేశానికి ఆహారాన్ని అందించే అన్నదాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మకర సంక్రాంతి ప్రజల జీవితాల్లో ఆత్మవిశ్వాసం, సానుకూలత, శాంతి సామరస్యాలను తీసుకురావాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు. దిల్లీలోని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

మరో వైపు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ సంక్రాంతి పండుగ.. సంస్కృతి, సంప్రదాయంలో ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గ్రామీణ మండలం గొల్లపూడిలో ఈరోజు తెల్లవారుజామున నిర్వహించిన భోగి వేడుకల్లో ఆయన విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగకు వేలాది మంది ఇతర ప్రాంతాల నుంచి సొంత రాష్ట్రానికి వచ్చి

పండుగ చేసుకుంటారని తెలిపారు. అనంతరం పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతోందని కేశినేని శివనాథ్ తెలియజేస్తూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా కొండెపి నియోజకవర్గ పరిధిలోని తూర్పు నాయుడుపాలెంలో 68 మంది లబ్దిదారులకు 50లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలెవరూ వైద్య ఖర్చుల నిమిత్తం ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కింద ప్రజలకు సకాలంలో CMRF చెక్కులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు కొండెపి నియోజకవర్గంలో 1,425 మంది లబ్దిదారులకు 11కోట్ల రూపాయలకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందించినట్లు మంత్రి వివరించారు. త్వరలో రాష్ట్రంలోని ప్రజలకు 25లక్షల రూపాయల ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు చెప్పారు.

వాయిస్...30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో వైద్య ఆరోగ్యాభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన 2 వేల 6 వందల కోట్లలో ఆఖరి, 5వ విడతకు సంబంధించిన గ్రాంటు 567 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం నిన్న విడుదల చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దీంతో 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన మొత్తం గ్రాంటును పొందటంలో రాష్ట్రం సఫలీకృతమైందని పేర్కొన్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు, నిధులను పొందేందుకు అధికారులు కృషిచేయాలని మంత్రి కోరారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న PRAGATI సమావేశం ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి దోహదపడుతోందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. లక్నోలో ప్రో-యాక్టివ్ గవర్నెన్స్, అండ్ టైమ్లీ ఇంప్లీమెంటెషన్ PRAGATI పై నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014కు ముందు పాలనాపరమైన సమస్యలతో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిలిచిపోయేవని చెప్పారు. ప్రగతి అమల్లోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయని, PRAGATI వేదిక రాష్ట్రాల మధ్య టీమ్ ఇండియా భావనను బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో 10 లక్షల 48 వేల కోట్లకు పైగా విలువైన 330 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో పాటు రైల్వే నెట్‌వర్క్, మెట్రో వ్యవస్థలు అభివృద్ధి చెందాయని తెలిపారు.

---------------------------

సాయుధ దళాల మాజీ సైనికుల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. భారత సైన్యానికి మొదటి కమాండర్-ఇన్-చీఫ్‌గా పనిచేసిన ఫీల్డ్ మార్షల్ కె.ఎం. కరియప్ప వారసత్వాన్ని, సేవలను గౌరవిస్తూ ప్రతి

సంవత్సరం జనవరి 14వ తేదీన సాయుధ దళాల మాజీ సైనికుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. కరియప్ప 1953లో ఇదే రోజున పదవీ విరమణ చేశారు. ఆయన దేశ సైనిక చరిత్రలో ఒక విశిష్ట వ్యక్తి. సేవ, క్రమశిక్షణ, దేశభక్తితో కూడిన శాశ్వత వారసత్వానికి పునాది వేశారు. ఈ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 34 రాజ్య సైనిక్ బోర్డులు, అలాగే 434 జిల్లా సైనిక్ బోర్డుల ఆధ్వర్యంలో జరుపుకుంటారు.

---------------------------

న్యూజిలాండ్ క్రికెట్ జట్టు భారత పర్యటనలో భాగంగా ఇరు జట్ల మధ్య నిర్వహిస్తున్న వన్ డే సిరీస్‌లో రెండవ మ్యాచ్ ఈ రోజు జరుగుతోంది. గుజరాత్ లోని రాజ్ కోట్‌లో ఉన్న నిరంజన్ షా స్టేడియంలో రెండవ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ బౌలింగ్ ఎంచుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇప్పటికే భారత జట్టు 1–0 ఆధిక్యంతో నిలిచింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో  రానున్న రెండు రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్...27 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

డా.బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో నూతన ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీల్లో అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు వివరించారు. ఈనెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు.అర్హులైన విద్యార్థులు https://apgpcet.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

======================